పోయాడంటే, ఈ విరక్తి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అక్కడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో ఏకంగా 99 శాతం మంది తాము ఏదో ఒక ఆరోగ్య సమస్యను ఎదుర్కొంటున్నామని చెప్పారు. ఇదంతా గమనిస్తున్న అక్కడి యువత ఓ రకమైన నైరాశ్యంలోకి జారిపోయి... అవసరానికి మించిన పని చేయకూడదు అని నిశ్చయించుకుంది. ఈ ట్రెండ్‌కి 'Lie Flat' అని పేరు. ఈ 996 విధానానికి అక్కడి పారిశ్రామికవేత్తలు మద్దతు పలకడం విశేషం. సహజం కూడా! ప్రముఖ వ్యాపారవేత్త జాక్‌మా, ఈ 996 విధానాన్ని యువత పాలిట వరంగా పేర్కొన్నారు. Pinduoduo లాంటి సంస్థలు ఉద్యోగుల ప్రాణాలు పోతున్నా... ఈ 996 విధానాన్ని కఠినంగా అమలు చేస్తున్నట్టు తేలింది. ఈ 996 పద్ధతితో అసలుకే మోసం వస్తున్నట్టు గ్రహించిన చైనా ప్రభుత్వం గత కొన్నేళ్లుగా, సదరు కంపెనీలను హెచ్చరించడం మొదలుపెట్టింది. అన్నట్టు ఓ ఉద్యోగి ఉదయం 9 నుంచి రాత్రి 9 వరకు 6 రోజుల పాటు కంపెనీలో ఉంటే 72 గంటల లెక్క తేలుతుంది. రోజుకు గంట చొప్పున భోజన, టీ విరామాలను ఇందులోంచి తీసేస్తే 72-6 = 66 పని గంటలు! అంటే నారాయణ మూర్తి సూచించిన 70 గంటలకు ఇంకా తక్కువే!

### లాభాలు లేవని కాదు!

ఉద్యోగుల కోణం నుంచి చూస్తే ఈ 70 పని గంటల సలహా కాస్త కటువుగా ఉండవచ్చు. అలాగని అది నిర్హేతుకం కాకపోవచ్చు. మరీ ముఖ్యంగా నారాయణ మూర్తి లాంటి వ్యక్తి నుంచి వచ్చినప్పుడు, దాని లాభాలను గమనించకుండా కొట్టిపారేయలేం. ఆయన చెప్పినట్టు జపాన్, జర్మనీలు దేశాన్ని పునర్నిర్మించుకునే దశలో చాలా ఎక్కువ గంటలే పనిచేశాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక స్థానానికి ఎదుగుతున్న దశలో, మన దేశ యువత నుంచి కూడా అలాంటి పనిని ఆశించడంలో తప్పు లేదు. చదువు పూర్తయి కుటుంబ బాధ్యతల్ని ఇంకా తలకెత్తుకోని దశలో ఉన్న యువకులు, కాలక్షేపం చేసే కంటే పని మీద శ్రద్ధ పెడితే... కొంతకాలానికి మంచి స్థాయికి చేరుకుంటారు. ఇక సొంత స్టార్టప్ ఆరంభించేవారు, ఓ కంపెనీ ఆరంభం నుంచి పనిచేసే వారు... దాన్ని విజయవంతం చేసేందుకు ఎన్ని గంటలు వెచ్చించినా సరిపోదు. ఎక్కువ పని గంటల వల్ల కొత్త కొత్త నైపుణ్యాలు అలవడే అవకాశం ఉంటుంది, పనిలో ఉండే ప్రతీ సవాలూ అర్థమవుతుంది, ఆర్థికంగానూ లాభాలు ఉంటాయి, యాజమాన్యం దృష్టిలో ఉంటారు! తమను తాము ఎలాగైనా నిరూపించుకోవాలి అనుకునేవారికి, కంపెనీ సీఈవోలకి 70 గంటల పనివారం ఓ మంచి అవకాశమే!

### ఉత్పాదక శక్తి తక్కువే!

ఒక వ్యక్తి ఉత్పత్తి చేసే వస్తువుల లేదా అందించే సేవల విలువను Workforce Productivity అంటారు. మన దేశంలో సగటు ఉత్పాదక శక్తి తక్కువగా ఉందన్నది నారాయణమూర్తి గారి మాట. నిజానికి ఈ ఉత్పాదక శక్తి చాలా విషయాల మీద ఆధారపడి ఉంటుంది. మరీ ముఖ్యంగా ఆ దేశపు ఆర్థిక వ్యవస్థే ఆ విలువను నిర్ణయిస్తుంది. తక్కువ జనాభా, ఎక్కువ వనరులు ఉన్న నార్వే, స్విట్జర్లాండ్‌లో అది ఎక్కువగా ఉంటుంది. ఎంత శ్రమించినా తక్కువ ప్రతిఫలం లభించే దేశాలలో సహజంగానే అది తక్కువగా ఉంటుంది. ఉదాహరణకు చైనాలో ఒక ఐఫోన్ తయారుచేసేందుకు అయ్యే ఖర్చు కేవలం పది డాలర్లే అనే వార్త ఈమధ్య కాలంలో సంచలనం సృష్టించింది. అదే ఐఫోన్‌ను అమ్మడం వల్ల అమెరికా కొన్ని వందల డాలర్లు సంపాదిస్తుంది. ఉత్పత్తి విలువ తక్కువ ఉన్నచోట జీతాలు కూడా తక్కువగానే ఉంటాయి. చాలా సాఫ్ట్‌వేర్ సంస్థలు, తమ సేవలను ఔట్‌సోర్సింగ్ చేయడానికి ముఖ్య కారణం ఇదే!





### లే ఆఫ్స్ సంగతేంటి?

తనకు నచ్చిన కంపెనీలో భవిష్యత్తు ఉంటుందనే భరోసా, ఎదిగే అవకాశం ఉంటుందనే ఆశ ఓ వ్యక్తిని ఎన్ని గంటలపాటైనా పనిచేయిస్తాయి. కానీ, సాఫ్ట్‌వేర్ రంగంలో ఆ నమ్మకం సన్నగిల్లుతున్నదనే భయం ఉంది. గతేడాది ప్రపంచవ్యాప్తంగా 2.6 లక్షల మందిని తొలగించారు. ఇన్నేసి తొలగింపులకు ముఖ్య కారణం నష్టాలు మాత్రమే కాదు. సంస్థలో అవసరానికి మించి ఉద్యోగులు ఉన్నారనే భావన, కృత్రిమ మేధతో రాబోయే రోజుల్లో మనుషుల అవసరం తగ్గుతుందనే అనుమానం... ఈ లే ఆఫ్స్‌కి ప్రధాన కారణం. 2023లో ఇన్ఫోసిస్ సైతం 24,182 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికినట్టు ప్రముఖ వార్తా సంస్థలు పేర్కొన్నాయి.